# ద్రోణుడు మరణించాడు



"నటరాజ కళానిలయం" అనే అక్షరాలు హెడ్‌లైట్ల కాంతిలో అత్యద్భుతంగా మెరుస్తూ ఆ ఓపెన్ ఎయిర్ థియేటర్ ప్రాంగణానికే వింతశోభను కలుగచేస్తున్నాయి.

"రాష్ట్ర స్థాయిలో ఉత్తమ నటుడి అవార్డును రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందుకున్న శ్రీ శివాజీ గార్కి సన్మాన సభ" అని వ్రాయబడిన బేనరు సిల్కు ధగ ధగలతో మెరుస్తూ తన ప్రత్యేకతను నిలబెట్టుకుంది. కనీ వినీ ఎరుగని రీతిలో ఏర్పాటు చేయబడ్డ ఆ సన్మానసభకు చాలా ప్రత్యేకత ఉంది. ఆ రోజు "నటరాజ కళానిలయం" రజతోత్సవ సంరంభం కూడా! నటరాజ కళానిలయం స్థాపకుడు, శాశ్వత గౌరవాధ్యక్షుడు అయిన భీమారావుగారు ప్రస్తుతం ప్రసంగిస్తున్నారు.

"ఈనాడు నాటకరంగం దీనాతిదీనావస్థలో ఉంది. నాటకరంగం నుంచి సినీ పరిశ్రమకు వెళ్లి అక్కడి కుటిలరాజకీయాలకు, మోసపూరిత వాతావరణానికి తట్టుకోలేక, కళామతల్లి ముద్దు బిడ్డలమని చెప్పుకోలేక బ్రతుకీడుస్తున్నారు కొందరు. తమ అంగబలంతో, అర్థబలంతో రాజకీయరంగ ప్రవేశం చేసి రాజ్యమేలుతున్నారు కొందరు. అటువంటి పరిస్థితులలో తన అత్యుత్తమ నటనా కౌశలంతో బండరాయి లాంటి హృదయాన్ని కూడా తన కరుణరసంతో పండించి కరిగించగల ఒక మహానటుడు, మన సభ్యుడు అయిన చిరంజీవి శివాజీని మన రాష్ట్ర ప్రభుత్వం వారు గుర్తించి ఉత్తమ నటనా అవార్డుగా, బంగారు నటరాజ విగ్రహం, పది వేల రూపాయల క్యాష్ అవార్డు యిచ్చి సన్మానించడం మన నాటక రంగ సభ్యులందరకూ రసరమ్యమైన పండుగ! శివాజీ వంటి నట దిగ్గజం మరింతగా కీర్తి ప్రతిష్ఠలు సంపాదించుకోవాలని, మన నాటకరంగాన్ని అభిమానులందరూ గర్వించేలా దిశదిశలా వ్యాపింపచేయాలని కోరుతూ ఆశీర్వదిస్తున్నాను. ఇపుడు చిరంజీవి శివాజీకి సన్మానం జరుగుతుంది. ఈ అవకాశం మనకు కలిగించిన రాష్ట్ర ప్రభుత్వానికి మన కళానిలయం తరపున కృతజ్ఞతలు అందచేస్తూ, ఆయనకు మనం చేసే సన్మానం స్వీకరించడానికి ప్రత్యేక ఆసనంలో కూర్చోవలసిందిగా కోరుతున్నాను".

అనంతరం వేద పండితులు వేద పఠనం చేస్తుండగా కార్పోరేషన్ మేయర్ శివాజీని ఘనంగా సన్మానించి, జ్ఞాపికను

అందచేశారు. సన్మాన పత్రం చదువుతుండగా పండితుల ఆశీర్వచనం జరిగింది. పావుగంట పైనే జరిగిన ఆ కార్యక్రమం పూర్తయ్యాక శివాజీ సన్మాన గ్రహీతగా మైక్ ముందుకు వచ్చాడు.

"సభకు నమస్కారం. కళాప్రియులకు, నన్ను అభిమానంతో ఆశీర్వదించిన పెద్దలకు, సభకు విచ్చేసిన ప్రతీ ఒక్కరికి నా శిరసువంచి నమస్కరిస్తున్నాను. ముందుగా మీరు నా పట్ల అభిమానంతో చేసిన యీ సన్మానానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. కృషి చేస్తే రాయి కూడా రత్నమౌతుంది. మట్టిని కూడా వెన్నముద్దను చేసి మనకు అనుగుణంగా మలచుకోవచ్చు. మరి ఆ శక్తిని, ఆ స్ఫూర్తిని కలుగ చేసే ఒక వ్యక్తి ఉండాలిగా! ఉన్నాడు. అణువు అణువు కరుణతో నిండిన ఆ హృదయం కలిగిన ఆ దివ్యమూర్తి ఎక్కడ ఉన్నాడో నాకు తెలీదు. కానీ బ్రతికి ఉన్నాడని తెలుసు. ఆయన నాటకాలే నా నటనకు స్ఫూర్తి. ఆయనే లేకుంటే యీ శివాజీయే లేడు. ఆ మహానుభావుడికి శిష్యుడనైన నేను తుది శ్వాస విడిచేలోగా నా గురుదక్షిణ సమర్పించుకోవాలని ఆకాంక్ష. అందుకే...అందుకే.. నాకు వచ్చిన పదివేల రూపాయలు క్యాష్ అవార్డను యీ కళానిలయం సిఫార్సు చేసే ఒక బీద వృద్ధ కళాకారునికి నా గురువు పేరు మీదుగా అందించాలని నిర్ణయించుకున్నాను. యిదే నా కనిపించని గురువుకు తెలియని శిష్యుడు సమర్పించుకునే గురుదక్షిణ. ఈ సభ ముగిసేలోగా పెద్దలు గురుతుల్యులు శ్రీ భీమారావుగారిని ఆ పేరు సిఫార్సు చేయవలసిందిగా కోరుతున్నాను. నన్ను యీ స్థాయికి పెంచిన కళామతల్లికి నేనిచ్చే నూలుపోగులాంటి సహాయం అందుకునే ఆ కళాకారుడు యీ సభలో ఉంటే, వేదిక మీదకు పిలువవలసిందిగానూ, లేకుంటే కనీసం ఆయన పేరునైనా సూచించ వలసిందిగాను కోరుతూ, నాపట్ల మీ అభిమానానికి మరోసారి కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ నమస్తే!".

అంతే! ఆ ఓపెన్ ఎయిర్ థియేటర్ ప్రాంగణమంతా చప్పట్లతో మార్మోగిపోయింది అదే పనిగా! శివాజీ నోటివెంట వృద్ధకళాకారునికి సహాయం అన్నమాట వినగానే భీమారావుగారు తీవ్రంగా స్పందించారు. ఆయన మాటంటే కళానిలయం సభ్యులందరికీ వేద వాక్కు. స్టేజీ మీద ఉన్న పెద్దలందరూ భీమారావుగారు ఎవరిని నిర్ణయించినా తమకు అభ్యంతరం లేదని సభాముఖంగా తమ అంగీకారాన్ని తెలియచేశారు.

ప్రేక్షకులు కూడా హర్షధ్వానాలతో తమ అంగీకారాన్ని తెలియచేశారు. సహాయం అందుకనే వ్యక్తి పేరుని సూచించడానికి మళ్ళీ మైకు ముందుకు వచ్చిన భీమారావుగారు స్థిరంగా యిలా అన్నారు.

"మళ్ళీ మైకు ముందుకు వచ్చి మీకు బోరు కొట్టను. నటనలోనే ఉన్నతుడు

అనిపించుకున్న ముప్పై అయిదేళ్ళ శివాజీ మానవత్వాన్ని చూపించడంలో మహోన్నతుడు అని నిరూపించాడు. యిపుడు అందరి అనుమతితో ఆ వృద్ధకళాకారుని పేరుని ప్రకటిస్తున్నాను. వారు నాకు గురుతుల్యులు. నటనలో నేనూ ఆయన వద్ద ఓనమాలు నేర్చుకున్నవాడినే. నా గురువునే తన గురువుగా భావించి ఆయనకు యీ క్యాష్ అవార్డు పదివేల రూపాయల చెక్ అందచేయవలసిందిగా చిరంజీవి శివాజీని కోరుతున్నాను. ఆయన పేరు శ్రీ సూర్య ప్రకాశరావుగారు! దయ చేసి సూర్య ప్రకాశరావుగారు ఎక్కడ ఉన్నా వేదిక మీదకు రావాలి! ఆయన డెబ్బై ఏడేళ్ళ వృద్ధుడు. వారిని సగౌరవంగా తోడ్కొని రావలసిందిగా కార్యకర్తలను కోరుతున్నాను. శ్రీ సూర్య ప్రకాశరావు గారూ!'' సభంతా మరల కరతాళధ్వనులతో మార్మో గిపోయింది.

అయిదు నిముషాలు గడిచినా ఎవరూ ముందుకు రాలేదు. అందరూ ఉత్కంఠతో మరో అయిదు నిముషాలు చూశారు. ఎవ్వరూ వేదిక వైపు రాలేదు.

భీమారావుగారు ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌ను పిలిచి అడిగారు. "అదేమిటి రఘూ! సూర్యప్రకాశరావుగార్కి నా అసిస్టెంట్‌తో మరీ ఇన్విటేషన్ పంపానే! ఆయన సభకు రాలేదా?''

"వచ్చారు సార్! నేనూ చూశాను. ఈ పనుల ఒత్తిడిలో పలకరించడం కుదరలేదు. ఆయన ఆ చివర ఉన్నారు. నేను వేదిక వద్ద ఉండిపోయాను'' అన్నాడతను ఆయనను కలవలేక పోయిన బాధను వ్యక్తంచేస్తూ!

★★★

"ఎవరు బాబు! మీకు ఎవరుకావాలి? దారిలోనే ఎదురు వస్తూ అడిగిన అతనిని ఎగాదిగా చూశాడా ముసలాయన.

నుదుట కుంకుమ బొట్టు, ఖాకీ యూనిఫారమ్, కళ్ళకు భూతద్దాల కళ్ళజోడు, కాళ్ళకు హవాయి చెప్పల్స్‌తో ఉన్న అతని రూపం చూస్తూనే ఆ యింటి వాచ్‌మన్ అని వెంటనే చెప్పచ్చు.

"యింతకీ మీఅయ్యగారున్నారా?'' అడిగాడు ముసలాయన.

"ఉన్నారు బాబూ! యింకా నిద్ర లేవలేదు.''

"నీ పేరు?''

"అప్పలస్వామి!''

"చూడు అప్పలస్వామి! అయ్యగారు లేచేంతవరకు వెయిట్ చేస్తాను. నాకు పనేమీలేదు. సరేనా! నేను ఎక్కడకూర్చోవాలో చూపించి ఏపాత పేపరైనా నా మొహాన పడేస్తే చదువుకుంటూ ఉంటాను మీ అయ్యగారొచ్చేటంతవరకు!'' ఎంతో కలుపుగోలుతనంతో మాట్లాడుతూనే వరండా మెట్లెక్కి హాల్లోకి వచ్చిన ఆయనని విజిటర్స్ రూమ్‌లో కూర్చోబెట్టక తప్పింది కాదు అప్పల స్వామికి.

కాసేపటి తర్వాత - "బాబుగారు! తమరొచ్చి రెండు గంటల పైనే అయింది.

కాఫీ ఏమైనా తెమ్మంటారా?''

"వద్దు అప్పలస్వామి. ఉదయం పది గంటలు దాటింది! యింతవరకూ మీ అయ్యగారు లేవలేదూ అంటే అసలు యింట్లో ఉన్నారంటావా! లేక నాతో అబద్ధం చెబుతున్నావా!'' సూటిగా ముసలాయన వేసిన ప్రశ్నకు అప్పలస్వామి కంగారు పడిపోయాడు.

"అబ్బే! అమ్మ మీద ఒట్టు! యిందాక ధైర్యం చేసి లేపబోయాను. తనంతట తను లేచేంతవరకూ నిద్రలేపితే తోలు తీస్తానన్నారు బాబు!''

"సరే! అయితే రేపు మళ్ళీ వస్తాను'' అంటూ ముందుకడుగేయబోయిన ముసలాయనని ఆపాడు అప్పలస్వామి.

"మళ్ళీ ఏంటయ్యా!''

"ఎవరొచ్చారని చెప్పమన్నారయ్యా!''

"సూర్యప్రకాశరావు. డెబ్బై ఏడేళ్ళ సూర్యప్రకాశరావుగారు వచ్చి వెళ్ళేరని చెప్పు!''

★★★

మరుసటి రోజు ఉదయం పదిగంటలకు ఎండలో చెమటలు కక్కుతూ వచ్చిన సూర్యప్రకాశరావుగారిని చూస్తూనే అప్పలస్వామి నాలిక కరుచుకున్నాడు.

"మీ అయ్యగారు ఈవేళ కూడా యింకా లేవలేదా?'' అడిగారాయన ముందుకు వంగుతూ.

"లేవకపోవడమేమిటి అయ్యగారు! ఈవేళ ఏడింటికేలేచి పూలరంగడిలా తయారై వెళ్ళిపోయారు!''

"వెళ్ళిపోయారా?'' హతాశుడై శూన్యంలోకి చూస్తూ అలాగే ఉండిపోతూ అన్నారాయన.

"యింతకీ మీరొచ్చిన పనేమిటి బాబూ!''

ఆయన అంతలోనే సీరియస్ అయిపోయారు. ఒక్కక్షణం తడపటా యించారు.

"మీకిబ్బంది అయితే చెప్పొద్దు బాబు!'' అన్నాడు అతను నొచ్చుకుంటూ! "అబ్బెబ్బె! ఆత్మాభిమానం అడ్డొస్తోంది అప్పలస్వామి. మొన్న జరిగిన సన్మాన సభలో ఆయాసంగా ఉంటేను సభ పూర్తవకుండానే యింటికి వెళ్ళిపోయాను. తరువాత రోజు అంటే మొన్న "నట రాజ కళానిలయం'' స్థాపకుడు భీమారావుగారని నా చిన్ననాటి స్నేహితుడు. శివాజీబాబు యిస్తానన్న క్యాష్ అవార్డుకు నన్ను ఎంపిక చేశానని వచ్చి ఆనందంగా చెప్పి నన్ను చూసి వెళ్ళాడు. నా మనవడికి, నా మనవరాళ్ళకి పబ్లిక్ పరీక్షల ఫీజు కట్టాలి. దీనిని ఉపయోగిద్దామని ఆశ పడ్డాను. వాళ్ళ దురదృష్టం ఏమిటో నాకు శివాజీని కలిసే అవకాశం రావడం లేదు'', అంటూ యింక అక్కడ పనిలేనట్టుగా నిర్వికారంగా లేచారు సూర్యప్రకాశరావుగారు.

★★★

మరుసటి రోజు ఉదయం ఏడు గంటల వేళ శివాజీ హాల్లో పేపరు చదువుకుంటూ కాఫీ తాగుతున్నాడు.

అప్పలస్వామి పద్దెనిమిదేళ్ల

నూనూగు మీసాల కుర్రవాడిని వెంట బెట్టుకొచ్చాడు.

ఏమిటన్నట్టు చిరాగ్గా చూశాడు శివాజీ!

ఆ కుర్రవాడు శివాజీకి ఒక కవరు అందించాడు. అందులోంచి రంగుమాసిన పాత లెటర్ హెడ్ కాగితాలమీద ముత్యాలసరాల లాంటి అక్షరాలతో పొదగబడిన ఉత్తరాన్ని బయటకు తీశాడు. పైపైన చదివేసి ప్రక్కన పెట్టేద్దామనుకున్న శివాజీ అంతరంగం మీద ఛెర్నాకోలా ఝుళిపిస్తున్నట్టుగా వ్రాయబడిన వాక్యాలను ఏకాగ్రతతో చదవడం మొదలుపెట్టాడు. అతనిలోని కఠినశిల మంచుశిలగా మారి తనకు తెలియకుండానే అశ్రువుల రూపంలో పెల్లుబుక సాగింది.

అందులో యిలా వుంది -

"మాననీయులు, గౌరవనీయులు శివాజీ గారికి కళాభివందనాలు. నా పేరు సూర్యప్రకాశరావు. సి.యస్.రావు అనేది నా నిక్‌నేమ్. నేను కళకు అంకితమై ఉన్న ఆస్తిని సర్వనాశనం చేసి భార్యాబిడ్డలను చెందనాడుకుని కీర్తి ప్రతిష్టలనే ఎండమావుల వెనుక సుదూర తీరాలు పరుగెత్తి అలసిపోయేసరికి నా జీవితం కరిగిపోయింది.

యింతటి చేదు జీవితంలో కళను నమ్ముకుని నేను సాధించిందేమీ లేదను కుంటే పొరపాటే. ఆనాటి నా కీర్తిప్రతిష్టలన్నీ ఆ కళామతల్లి పెట్టిన భిక్షే. మిగతా యీనాటి జీవితం కేవలం నా స్వయంకృతాపరాధం.

యిన్నేళ్ళ జీవితంలో నేను మరిచిపోలేని అపురూప సంఘటన ఒకటి మీకు వివరిస్తున్నాను. అది నేను యింకా చిత్రరంగంలో అడుగుపెట్టని రోజులు. నేను రచించి దర్శకత్వం వహించిన నాటకాన్ని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం టౌను హాలులో ప్రదర్శిస్తున్నరోజు. నేను మేకప్ రూమ్‌లో మేకప్ వేసుకుంటున్నాను. ఒక ఏడేళ్ళ కుర్రవాడు గడపనానుకుని నేను మేకప్ అయ్యే విధానాన్ని పరిశీలిస్తున్నాడు.

"లోపలికి రా!" అన్నాను.

"భయంగా ఉంది" అన్నాడు.

"నీ పేరు?" అడిగాను.

"రాజు!"

"నీకు నాటకాలంటే యిష్టమా!"

"చాలా యిష్టం సార్. మీ పేరు, పేపర్లలో మీ ఫొటోలు చూడడం నాకు ఎంతో యిష్టం. మీరు కరుణరసం ఎంతోబాగా పోషిస్తారని మా అమ్మ అన్తమానం అంటుంది. మీరు నటిస్తుంటే చూడాలని నా కోరిక. అందుకే అమ్మతో చెప్పకుండా వచ్చాను. నాటిక చూశాకా వెళ్తాను."

ఆ రోజు హాలు హాలంతా కిటకిటలాడిపోతోంది. అయినా నేను వాడిని ముందు సీట్లో కూర్చోపెట్టించాను. మధ్యమధ్యలో నిద్ర వస్తుండగా కళ్ళు నులుముకుని ఎక్కడ ఏ దృశ్యం మిస్ అయిపోతానో అని వాడు చూపిన ఉత్కంఠను నేను ఎన్నడూ మర్చిపోలేను. నాటకం పూర్తయి చూసేసరికి వాడు కుర్చీలోనే నిద్రపోతూ కనిపించాడు. వాడిని

లేపి ముఖం కడిగించి వాడితో ఫోటో తీయించుకున్నాను. నా ఆ నాటకానికి బాల ప్రేక్షకుడు వాడొక్కడే. అది ఒక తడిజ్ఞాపకం! నా నటనకు అతనిలాంటి అభిరుచి ఉన్నవాడే వారసుడు అనుకున్నాను.

యిదంతా ఎందుకు చెబుతున్నానంటే ఎండమావులవెంట పరుగెత్తి బంగారు జీవితాన్ని పాడుచేసుకున్న నేను, నా తరువాత తరం నటునిగా మీకు యిచ్చే పనిలేని సలహా - "జీవితాన్ని అద్దంలా చూసుకోమని".

ఆత్మాభిమానం చంపుకుని రెండు రోజులు మీయింటికి వచ్చాను. రాత్రి నుంచి విపరీత ఆయాసంతో వూపిరి పీల్చడం కష్టంగా ఉంది. మీరు చేస్తానన్న ఆర్థిక సాయం పొందడానికి నటరాజకళానిలయం వారు యిచ్చిన సిఫార్సు లెటర్ కాపీ కూడా దీంతో జత పరుస్తున్నాను.

మీకు అభ్యంతరం, యిబ్బంది లేకుంటే మీరు చేస్తానన్న ఆర్థిక సహాయం నా మనవడికి యిచ్చివేయండి. నేను స్వయంగా రాలేకపోతున్నందుకు మన్నించండి. "నిజమైన కళాకారుడెప్పుడూ ఆర్థికంగా కుచేలుడే!" అని అసహ్యించుకోకండి. మీ సహాయానికి, సహాయం చేస్తానన్న మాటకి ఆజన్మాంతం కృతజ్ఞుడిని. మిమ్మల్ని ఆ నటరాజు సదా దీవించాలని కోరుతూ!

మీ సహాయం అర్థించే
సి.యస్.రావ్! (సూర్యప్రకాశరావు)"

ఉత్తరం చదివిన వెంటనే ఒక్కసారి చేతుల్లో ముఖం దాచుకుని భోరున విలపించసాగాడు శివాజీ.

తెల్లబోయి వింతగా చూడసాగారు అప్పలస్వామి, ఆ వచ్చిన అబ్బాయి.

అయిన నిముషాల అనంతరం తేరుకున్న అతను లేచి గబగబా లోపలకు వెళ్ళి మరో అయిదునిముషాలలో తయారయి వచ్చాడు. అతని సిల్కులాల్చీ జేబులోంచి హడావుడిగా దోపిన వందరూపాయల నోట్ల కట్ల తొంగి చూస్తోంది.

"బాబూ! నీ పేరు!"

"ప్రకాశ్ రాజు!"

శివాజీ, అతనితో అప్పలస్వామి వెంటరాగా బయల్దేరాడు సూర్యప్రకాశరావు గారింటికి.

దారిలో రాజు చెప్పిన విషయాలన్నీ జీర్ణించుకోలేక పోయాడు శివాజీ. ఎంత వద్దనుకున్నా తన నిర్లక్ష్యం ఒక వ్యక్తిని ఎంతటి వేదనకు గురిచేసిందో అర్థమవుతుంటే అతని కళ్ళు వూటబావిలా చమర్చుతూ స్ఫటికాల్లా మెరుస్తూ, మనసుపొరల మధ్య దాగున్న దుర్గుణాలన్నీ కరిగి కరిగి పోతున్నట్టుగా ఉన్నాయి.

అతను గుమ్మంలో అడుగు పెడుతూనే ఆయాసంతో రొప్పుతున్న సూర్యప్రకాశరావు గారి పాదాలకు నమస్కరించి "గురువుగారూ! నన్ను....నన్ను క్షమించండి!" అంటూ బావురుమన్నాడు.

ఎవరికీ ఏమీ అర్థంకాని ఆ పరిస్థితిలో నెమ్మదిగా కళ్ళు తెరచిన రావుగారి ప్రక్కనే కూర్చున్నాడు శివాజీ!

"గురువు గారూ! నేను! నేను రాజుని! మీరు మీ జీవితంలో జ్ఞాపకంగా ఉంచుకున్న శివాజీ రాజుని! యిదిగో మన యిద్దరం తీయించుకున్న ఫోటో!" అంటూ శివాజీ తన జేబులోంచి ఫోటోతోపాటు నోట్లకట్టను కూడా ఆయన చేతులకి అందించాడు.

ఆయన కళ్ళల్లో వింత శక్తి ప్రవేశించినట్టుగా ఆశ్చర్యంతో కనులు పెద్దవి చేసి ఫోటోని పరిశీలించారు. నెమ్మదిగా మనవడి సాయంతో లేచిన ఆయన శివాజీని అత్యంత సంతోషాతిరేకంతో కౌగిలించుకున్నారు. "బాబూ! రాజూ!" అంటూ! మనవడు రాజు చేతిని శివాజీ చేతుల్లో ఉంచారు.

"నిన్ను...నిన్ను కలుస్తానని అనుకోలేదురా! నామనవడికి నీ పేరు పెట్టి నిన్ను వాడిలో చూసుకుంటున్నాను. యిక వాడి చదువు బాధ్యత నీదే.." ముద్దగా వస్తున్న మాటలు ఆగిపోయి అచేతనంగా శూన్యంలోకి చూస్తూ ఉండిపోయిన ఆయనను చూస్తూనే అందరూ గొల్లుమన్నారు.

ఏకలవ్య శిష్యరికం చేసి గురువుగారి బొమ్మను ప్రత్యక్షప్రేరణగా తీసుకుని, ఆ స్ఫూర్తితో గురువుని మించిన శిష్యుడైన శివాజీ రాజు చేతుల్లో - భారతంలో ద్రోణుడు ధర్మయుద్ధంలో మరణించినట్టుగానే ఒక ద్రోణుడు మరణించాడు. అయితే ఒక్కటే తేడా!

ఆత్మసంతృప్తితో!

●

'ఆంధ్రప్రదేశ మాసపత్రిక'
మార్చి, 2003